మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కేవీపల్లె : స్థానిక ఏపీ మోడల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 రుసుము ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఏప్రిల్ 27న మెరిట్ జాబితా విడుదలవుతుందని చెప్పారు. ప్రసుత్తం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాబ్‌మేళాలో 8 మంది ఎంపిక

తంబళ్లపల్లె: స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ఐటీఐలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధికల్పన సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళాకు 15 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. మెడ్‌ప్లస్ ప్రతినిధి మధు విద్యార్హత, నైపుణ్యాలను పరీక్షించి ఆరుగురిని ఎంపిక చేశారు. ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధి మరో ఇద్దరిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ చౌడయ్య పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు మృతి

కురబలకోట: మండల నాయీ బ్రాహ్మణ సంఘ తొలి అధ్యక్షుడు అంగళ్లుకు చెందిన టీఎం వెంకట్రమణ (61) శనివారం వేకువ జామున ఆకస్మికంగా మృతి చెందాడు. ఇతను కుల పెద్దగా, ఆ సామాజిక సంఘం నేతగా వివిధ సేవలు అందించారు. వివిధ వాయిద్య కళల పట్ల కూడా మక్కువ చూపుతూ ప్రోత్సహించేవారు. నాయీ బ్రాహ్మణ సంఘ పటిష్టతతో పాటు వారి సంక్షేమానికి కృషి చేశారు. శనివారం సాయంత్రం ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఇతని మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ల నియామకం

పీలేరు : నియోజకవర్గంలో ఆరు మండలాలకు సంబంధించి మండల కన్వీనర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కన్వీనర్ల వివరాలిలావున్నాయి. పీలేరు – దండు జగన్‌మోహన్‌రెడ్డి, కేవీపల్లె – వెంకటరమణారెడ్డి, కలికిరి – చింతల రమేష్‌కుమార్, కలకడ – కమలాకర్‌రెడ్డి, గుర్రంకొండ – ముక్తియార్ అలిఖాన్‌లను యథావిధిగా కొనసాగించారు. వాల్మీకిపురం మండల కన్వీనర్‌గా నూతనంగా పులి శివకుమార్ రెడ్డి నియమితులయ్యారు.

వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా షబ్బీర్

పీలేరు : నియోజకవర్గ వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా పీలేరుకు చెందిన షేక్ షబ్బీర్‌ను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ విభాగంలో నియోజకవర్గ అధ్యక్షులుగా తన నియామకానికి సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'పెద్దల నమ్మకాన్ని నిలబెడతా'

కలకడ : వైఎస్సార్ సీపీ పెద్దల నమ్మకాన్ని నిలబెడతానని, మైనార్టీ ఓట్లు కాపాడటానికి తనవంతు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మస్తాన్ అహమ్మద్ అన్నారు. శనివారం కలకడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కౌన్సిల్ సమావేశంలో ప్రోటోకాల్ రగడ

- ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత ఎక్కడ ?
- పోడియం ఎదుట కింద కూర్చుని కౌన్సిలర్ల నిరసన


ప్రోటోకాల్ విషయంలో అన్యాయాన్ని చైర్‌పర్సన్‌కు వివరిస్తున్న వైస్‌చైర్మన్ జింకాచలపతి, కౌన్సిల్ సభ్యులు

మదనపల్లె : మున్సిపాలిటీలోని 35వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల పంపిణీ, ఇతర అంశాల్లో అడుగడుగునా ప్రోటోకాల్ ఉల్లంఘన జరుగుతోందని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. వార్డులో జరుగుతున్న అభివృద్ధిపనులు, పెన్షన్ల పంపిణీ కార్యక్రమాలు.. ఎన్నికల్లో తమకు వ్యతిరేకంగా పోటీచేసి ఓడిపోయిన నాయకులతో జరిపించడమేంటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యపద్ధతిలో రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన తమకు విలువ లేనప్పుడు ఈ పదవి ఎందుకు? సమావేశం ఎందుకు? అంటూ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ..వేసవిలో నీటిఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా పట్టణంలో నీటిఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో నూతనంగా బోర్లు వేస్తున్నామన్నారు. అలాగే పాతబోర్లలో నీటిలభ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహాశివరాత్రి, రంజాన్‌మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం సమావేశంలో భాగంగా అజెండాలోని అంశాలను చదివి వినిపిస్తుండగా, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ...ఆయా వార్డుల్లో మున్సిపల్ కౌన్సిలర్లకు ప్రోటోకాల్ ఉంటుందని, కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపల్, సచివాలయ సిబ్బంది తమను గుర్తించడం లేదన్నారు. పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఏమాత్రం సంబంధం లేని వ్యక్తులతో పంపిణీ చేస్తూ, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన పదవికి విలువ లేకుండా చేస్తున్నారన్నారు. వార్డుల్లో జరిగే ప్రారంభోత్సవాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు తమకు ఆహ్వానం అందడం లేదని, ఉద్దేశపూర్వకంగానే ఇవన్నీ చేస్తున్నారా అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఎదుటే ప్రశ్నించారు? మున్సిపల్ షాపురూముల వేలంపాటల్లో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు పాల్గొని షాపులు దక్కించుకోవడంపై కమిషనర్ ప్రమీలను వివరణ కోరారు. కౌన్సిలర్ పెరవలిరాజేష్ మాట్లాడుతూ...వార్డులోని సమస్యలపై ఎన్నోసార్లు కౌన్సిల్‌లో ప్రస్తావించినా, కల్వర్టు, ప్యాచ్‌వర్క్‌లు చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా గత సమావేశంలో ఆదేశించినా ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. 6వవార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ..కౌన్సిల్ ఎన్నికై 4 ఏళ్లు పూర్తికావస్తున్నా ప్రోటోకాల్ గురించి సమావేశంలో మాట్లాడటం బాధాకరమన్నారు. కౌన్సిల్‌ను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ...వార్డుల్లో కౌన్సిలర్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని, వారితోనే పెన్షన్ పంపిణీ జరపాలని, అయితే తమ పార్టీకి చెందిన వ్యక్తులు ఉంటారన్నారు. మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ బాగోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వేసవిలో నీటిసమస్యను ఎదుర్కొనేందుకు, కనీసం 3 రోజులకు ఒకసారి నీళ్లు ఇచ్చేలా పూర్తిస్థాయి యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలన్నారు. ఎమ్మెల్యే సమావేశం నుంచి వెళ్లిపోయిన తర్వాత ప్రోటోకాల్ ఉల్లంఘనలకు నిరసనగా చైర్మన్ పోడియం ఎదుట బైఠాయించి సభ్యులు నిరసన తెలిపారు. .

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మదనపల్లె సిటీ: ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 12వ పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్ ప్రకటించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. శనివారం మదనపల్లెలో ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలు అడియాశలు కాకుండా ఉద్యోగులకు ఇచ్చిన హామీలు చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. ఇందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చొరవ తీసుకోవాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు గత ఆరేళ్లుగా నిలిచిపోయిన పదోన్నతులు వెంటనే ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాని కారణంగా సుమారు 3 వేల మంది ఉద్యోగులు పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కొంత మంది ఉద్యోగులు పదవీవిరమణ పొందారన్నారు. ప్రభుత్వం వెంటనే పదోన్నతులు ఇచ్చేందుకు ఆర్టీసీ యాజమాన్యంతో చర్చించి అనుమతులు ఇప్పించాలని కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈయు బలపడుతోందన్నారు. మదనపల్లె–2 డిపోలో ఎన్ఎంయు మాజీ జోనల్ కార్యదర్శి విజయకుమార్ అనుచరులతో కలసి ఈయులో చేరారు. కార్యక్రమంలో ఈయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, జోనల్ నాయకులు చంద్రశేఖర్, తిరుమలనాథ్, జిల్లా అధ్యక్షులు సి.ఆనందశ్‌బాబు, కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నిమ్మనపల్లె : వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ డి.నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆయా శాఖల పనితీరుపై అధికారులతో సమీక్షించారు. కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులకు మెమో జారీ చేయాలని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డిని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు తాగునీటి బోర్లు, పైపులైన్లు మరమ్మతులు ఎప్పటికప్పుడు చేసుకోవాలన్నారు. గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులను శుభ్రపరచాలని ఆదేశించారు. నిమ్మనపల్లి కందూర్ రోడ్డు, రాచవేటివారిపల్లె గొల్లపల్లెలో తాగునీటి అవసరాలకై విద్యుత్తు సౌకర్యాన్ని వెంటనే పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కలసికట్టుగా పనిచేయాలన్నారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయప్రకాశ్ రెడ్డి, సర్పంచులు వరలక్ష్మి, ఉషారాణి, జి.శ్రీవాణి , సుబ్రమణ్యం, పాపులమ్మ , రెడ్డప్ప, తహసిల్దార్ అమర్నాథ్, ఎంపీడీవో పరమేశ్వర్ రెడ్డి, సీడీపీఓ సుజాత, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

నిమ్మనపల్లె: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా టీడీపీ నాయకులతో కలిసి శనివారం లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ పిల్లగోవుల పల్లెకు చెందిన ఏ.రమణమ్మకు రూ.51,390, రెడ్డివారిపల్లి పంచాయతీ దివిటీవారిపల్లెకు చెందిన గోపమ్మకు రూ.3,02,450ల చెక్కులను వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు జి.శ్రీవాణి , సుబ్రమణ్యం, టీడీపీ మండల అధ్యక్షులు వెంకటరమణ, రాజన్న, రెడ్డప్ప రెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసుల రెడ్డి, శ్రీపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ ఈఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

కేవీపల్లె : భూమి ఉన్న ప్రతి రైతు ఈఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని వ్యవసాయాధికారి శ్రావణి తెలిపారు. శనివారం మండలంలోని వగళ్ల రైతు సేవా కేంద్రంలో రైతు నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడానికి నిర్ణయించడం జరిగిందని తెలిపారు. డిజిటల్ గుర్తింపు కార్డు పొందడానికి రైతుల సేవా కేంద్రాల్లో రైతులు ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరుతో తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందడానికి డిజిటల్ గుర్తింపు కార్డు ఉపయోగపడుతుందని తెలిపారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE OF MADANAPALLE
I.A. NO. 5 OF 2024
O.S. No. 8 OF 2015
Petitioner:
Varada Sudhakar
Respondents:
S. Sarthaz and others
NOTICE TO THE 7TH RESPONDENT
7) S. Siraj Ahamed S/o. Lat Usman Ali, aged about 38 years, Muslim, residing at D.No. 5-67-B, Apparao Garden, Madanapalle.
పై దావా నందు మీరు హాజరగుటకు గాను తేది. 07.03.2025 న వాయిదా వున్నది. మీరు పై తేదీన ఉదయం 10–30 గం.లకు కోర్టువారి ఎదుట నేరులో గానీ లేదా మీ వకీలు ద్వారాగానీ హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవలయును. లేనంతట మీ పరోక్షములో ఉత్తర్వులు పాలించెదరు.
యన్.యస్.యన్. ప్రసాద్,
అడ్వొకేట్, మదనపల్లి.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పెద్దతిప్పసముద్రం: మండలంలోని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైదేహీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారు శనివారం రంగసముద్రంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో వంద మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించుకోగా వీరిలో 15 మంది ఉచిత మోకాళ్ళు, కంటి శస్త్ర చికిత్సకు ఎంపికైనట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, డాక్టర్ లోకేష్ భరణి తెలిపారు. ఎంఈఓ గౌస్‌పీర్, ఎస్ఐ హరిహర ప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు వైద్య సిబ్బందిని కొనియాడారు.

ఉచిత దంత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం వేంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం హరినాథ్ గార్ల చారిటబుల్ ట్రస్టు,గార్డు సంస్థ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ జి.భరత్‌కుమార్, డాక్టర్ జి.ప్రతిభలు విద్యార్థులు దంత చికిత్స చేశారు.

ఉలవ పంటకు నిప్పు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ పంచాయతీ గాజులవారిపల్లె వద్ద శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఉలవ పంటకు నిప్పు పెటాట్టారు. స్థానిక మార్కెట్‌యార్డుకు గాజులవారిపల్లెకు మధ్యలో గుట్టల నడుమ పొలాల ఉన్నాయి. కొంతమంది రైతులు పొలాల్లో ఉలవపంటను సాగు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు మార్కెట్‌యార్డుకు సమీపంలో పొలాల గట్టుకు నిప్పు అంటించారు. ఈ మంటలు ఎగిసి పడుతూ గుట్టలు పొలాలను కాల్చిబూడిద చేశాయి. ప్రమాదంలో రమణ అనే రైతుకు చెందిన పొలంలో సాగు చేసిన ఉలవ పంట కాలిపోయింది. మరికొందరు పంటను కోసి కుప్పలు పోసి ఉండగా అవికూడా కాలిపోయాయి.

శేషవాహనంపై సిద్ధేశ్వరస్వామి

కలకడ : మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి కలకడ శ్రీకామాక్షి సిద్ధేశ్వరస్వామి వైశ్యులు ఏర్పాటు చేసిన శేషవాహనంపై పురవీధులలో ఇంటింటి పూజలు అందుకున్నారు. ఆదివారం హంసవాహనం, సోమవారం మయూర వాహనం, మంగళవారం గజవాహణం, బుధవారం వృషభవాహనం, గురువారం యాళివాహనము, మార్చి1న సింహవాహనం, 2వతేదీన అశ్వవాహనము, 3వతేదీన తెప్పోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త త్రికూటమి రవీంద్రశర్మ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పరిష్కరించాలి

పీలేరురూరల్ : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరితగతి పరిష్కరించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, సత్యాల రామకృష్ణ కోరారు. శనివారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను మంగళగిరి డీజీపీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం

మదనపల్లె సిటీ: ప్రపంచ స్కౌట్స్ దినోత్సవ వేడుకలు శనివారం మదనపల్లెలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బసినికొండవద్దనున్న కూరపర్తి చైతన్య బాలల ప్రవంతి అనాథాశ్రమంలో జిల్లా స్కౌట్స్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు పంచిపెట్టారు. పిల్లల్లో సేవాభావం మంచి ఆలోచన క్రమశిక్షణ పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో కూడా పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్లు ఉమా, భార్గవి,శివగంగా, మంజుల తదితరులు పాల్గొన్నారు. మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ స్కౌట్స్ దినోత్సవం పురస్కరించుకుని పాఠశాలలో హెచ్ఎం ఆంజనేయులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పిల్లలకు స్కౌట్స్‌లో ఉండటం ద్వారా సేవాదృక్పథం, క్రమశిక్షణ ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్లు నాగరాజు, నరేష్ బాబు, శాంతి తదితరులు పాల్గొన్నారు.